క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి



ఇంద్రానగర్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

కొందుర్గు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ మహేష్‌బాబు సూచించారు. శనివారం ఎంపీడీఓతోపాటు తహసీల్దార్ విజయ్‌కుమార్ జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్‌లోని గురుకుల బాలుర పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు అక్కడ విద్యార్థులకు పెట్టే భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వారు విద్యార్థులతో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు.

ఆ టీచర్‌ను మాకే కేటాయించండి



హెచ్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎంసీ సభ్యులు

కొత్తూరు: డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలకు వెళ్లిన లక్ష్మీదేవిని తిరిగి తమ పాఠశాలకు కేటాయించాలని శనివారం ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు సర్పంచ్ తులశమ్మకు, హెచ్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్ధాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్‌పై పంపడంతో స్థానికంగా చదువుకుంటున్న విద్యార్థులకు నష్టం కలుగుతుందన్నారు. అంతేకాకుండా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు సైతం ఉపాధ్యాయురాలు లక్ష్మినే కేటాయించాలని కోరుతున్నట్లు వారు చెప్పారు. ఈ విషయంలో తమకు సహకరించాలని వారు సర్పంచ్‌తో మొర పెట్టుకున్నారు.

మీసేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

కొత్తూరు: మీసేవ కేంద్రాల నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం కొత్తూరు, నందిగామ మండలాల మీసేవ నిర్వాహకులు తహసీల్దార్ జానకికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి మీసేవ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్న నిర్వాహకులకు కమీషన్లను పెంచడంతో పాటు ఉచితంగా ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. అంతేకాకుండా వాటికి ఉచిత కరెంటు, ధరణి పోర్టల్ ద్వారా జరిగే లావాదేవిల డ్యాక్యుమెంట్ రైటింగ్, ఇతర సదుపాయాలను కేటాయించాలన్నారు. ముఖ్యంగా మీసేవ కేంద్రాల నిర్వాహకులకు హెల్త్‌కార్డులు మంజూరు చేసేవిధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేశ్, మల్లేశ్, దేవయ్య, మహేశ్, శ్రీకాంత్, నర్సింహ్మా, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



శుభాకాంక్షలు తెలుపుతున్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా ఎంపికైన సీతా రెడ్డిని శనివారం శంకర్‌పల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, ఏఎంసీ చైర్మన్ పాపారావు, కౌన్సిలర్లు శ్వేత, చంద్రమౌళి, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయంలో పూజలు

షాద్‌నగర్: ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర బీజేపీ నేత ఏపీ మిథున్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి పల్లకి సేవలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక సమస్య దూరమవుతుందన్నారు. రఘుపతిరావు, కృష్ణ, ప్రమోద్, సునీల్, కౌన్సిలర్ లతా శ్రీ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



కేశంపేట: మొక్కలకు నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి తెలంగాణను హరిత తెలంగాణగా మార్చాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఒకే రోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ భాగస్వాములై మొక్కలను నాటి సంరక్షించాలని ఆయన కోరారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత అడవుల విస్తీర్ణత పెరిగిందన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

చౌలపల్లి గ్రామంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. గడిగే విష్ణుగౌడ్, డేవిడ్‌రాజ్, మహేష్‌గౌడ్, జంగయ్య, రాఘవేందర్, రాజు, కుమార్, రవి, సురేష్, రమేష్‌లకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ ఎల్లనమోని రవీందర్ యాదవ్, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: మొక్కల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో నిర్వహించిన హరితహారంలో ఆమె మొక్కలు నాటారు. అనంతరం లావణ్య మాట్లాడుతూ రాష్ట్రంలో తగ్గిపోయిన అడవులు, చెట్ల శాతాన్ని పెంచడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన హరితహారం విజయవంతమైందన్నారు. గత 8 విడతలుగా రాష్ట్ర వ్యాప్తంగా నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగాయని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పలుచోట్ల మొక్కలు నాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో దేవేందర్‌యాదవ్, డోలీ రవీందర్, గోపాల్‌గౌడ్, యాదయ్య, రాజేందర్‌గౌడ్, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, చంద్రకళ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటండి

శంకర్‌పల్లి: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని గ్రీన్ పార్క్ వెంచర్‌లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ శ్వేత, టీపీఓ భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: మొక్కలు నాటుతున్న విజయలక్ష్మి

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్: హరితోద్యమంలో ప్రజలందరు భాగస్వామ్యం కావాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. పట్టణంలోని ఒకటవ వార్డులో ఆయన మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటడంతో పాటుగా వాటిని సరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ ఎంఎస్ నటరాజన్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు కానుగు అంతయ్య, జీటీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

కర్నాటక ఎమ్మెల్యే వేద వ్యాస్ కామత్

కేశంపేట: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని కర్నాటక రాష్ట్రంలోని మంగుళూరు సౌత్ ఎమ్మెల్యే వేద వ్యాస్ కామత్ అన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న ప్రవాస్ యోజనలో భాగంగా శనివారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేదవ్యాస్ కామత్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలను నేటికి నేరవేర్చలేదన్నారు. గతంలో ఇచ్చిన హామీలను మరిచి మళ్లీ కొత్తగా హామీలను ఇస్తు ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ఇచ్చిన అబద్ధపు హామీలను కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని ఆయన కోరారు. బీజేపీ అధికారంలోకొస్తే ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్, అశోక్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లె ఆనంద్‌కుమార్, అంజయ్య, మోటె శ్రీను, నర్సింహ, రాఘురాంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్: తెలంగాణలో కొనసాగుతున్న కుటుంబ పాలనను వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే వేద వ్యాస్ కామత్ అన్నారు. అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేఖ విధానాలతో పూర్తిగా విసుగుచెందారన్నారు. సాగు, తాగు నీరందరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నేటికి పూర్తి కాలేదన్నారు. ఈ పథకంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలోని లక్ష్మిదేవిపల్లిలో నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్‌కు ప్రభుత్వం సర్వే కూడా చేయించలేదని ఆరోపించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్, జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, చిట్టెం లక్ష్మికాంత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: మాట్లాడుతున్న వేద వ్యాస్ కామత్

అర్హులు ఓటు నమోదు చేసుకోండి

తహసీల్దార్ చిన్న అప్పల నాయుడు



తాళ్లపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ చిన్న అప్పల నాయుడు

షాబాద్: అర్హులు ఓటు నమోదు చేసుకోవాలని షాబాద్ తహసీల్దార్ చిన్న అప్పల నాయుడు అన్నారు. శనివారం మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద సంబధిత బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలన్నారు. బీఎల్‌ఓలు తమ పోలింగ్ బూత్‌లను పరిశీలించి గది, విద్యుత్, మరుగుదొడ్ల నిర్వహణ తదితర విషయాలను గుర్తించి తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రాథమిక స్థాయిలో బీఎల్‌ఓలు బాధ్యతతో పనిచేసి అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. ఇప్పటికీ కొందరిపేర్లు తప్పుగా ఉండి, మరికొందరి పేర్లు జాబితాలో లేకుంటే వారికి తగిన అవగాహన కల్పించి దరఖాస్తులు పెట్టుకునేలా చూడాలన్నారు. చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ

కొందుర్గు: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజు ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు సర్కారు ఇస్తున్న పారితోషికం ఆశవర్కర్లకు సరిపోవడం లేదన్నారు. నెలకు కనీసం రూ.19వేల వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రోగులకు సేవలందిస్తున్న ఆశవర్కలను ప్రభుత్వం చిన్నచూపు చూడకుండా ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గోపాల్, పావని, అంజలి, రాములమ్మ, సువర్ణ పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: ఆశ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ చిన్న అప్పల నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన్నట్లు తెలిపారు. ఆశ కార్యకర్తల శ్రమను ప్రభుత్వం దోచుకుంటుందని మండిపడ్డారు. వారికి వెంటనే రూ.18వేలు వేతనం నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలపై పని భారం విపరీతంగా పెరిగిందని శ్రమకు తగిన వేతనం ప్రభుత్వం ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల సీఐటీయూ నాయకులు మామిడిపల్లి నరసింహా, ఆశ కార్యకర్తల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, మాధవి, కోశాధికారి జయమ్మ, చందనవెళ్లి ఆశ యూనియన్ నాయకురాళ్లు మంజుల, రాణి, రజిత, సరిత తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

కేశంపేటలో..

కేశంపేట: తమకు కనీస వేతనం అందించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదట ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ అజీంఅలీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఆశ కార్యకర్తలుగా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వం తమకు కనీస వేతనం అందించడం లేదన్నారు. తక్షణమే తమకు పనికి తగ్గ వేతనం అందజేయాలన్నారు. మండల అధ్యక్షురాలు సుజాత, వసంత, మల్లమ్మ, భాగ్యమ్మ, పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: మండల అభివృద్ధికి చేపట్టే పనుల్లో ప్రజల భాగస్వామ్యం తప్పకుండా ఉండాలని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమతమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభలో విన్నవించారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. నిత్యం అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల్, ఎంపీఓ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి


బీసీ కులాలను రాజకీయంగా అణచివేస్తున్నారు



మోకిల చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

శంకర్‌పల్లి: సీఎం కేసీఆర్ బీసీ కులాల నాయకులను రాజకీయంగా అణచి వేస్తున్నారని శంకర్‌పల్లి మండల ముదిరాజ్ సంఘం, బీసీ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం శంకర్‌పల్లి మోకిల గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 60లక్షల మంది ముదిరాజ్‌లు, గంగపుత్రులు ఉన్నారని తమ సామాజిక వర్గానికి అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా కేటాయించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లను రాజకీయంగా ఎదగకుండా అణచి వేస్తున్నారని వారు ఆరోపించారు. తమ సామాజిక వర్గం నుంచి పటాన్ నియోజకవర్గంలో నీలం ముదిరాజ్‌కు, సంగారెడ్డిలో పులిమామిడి రాజు ముదిరాజ్‌కు ఎమ్మెల్యే టికెట్‌లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌండ్ర సత్యం, శంకర్‌పల్లి ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీనివాస్, మన్నె వెంకటేశం, మైసయ్య, శ్రీనివాస్, హరీశ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

కొందుర్గు: లద్దాక్ బేరి ప్రాంతంలో లోయలో పడి ప్రమాదవశాత్తు మృతి చెందిన వీరజవాన్ చంద్రశేఖర్ కుటుంబానికి తోటి స్నేహితులు ఆసరగా నిలిచారు. కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2008–09 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు రూ. ఒక లక్ష శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ సభ్యులకు మనో ధైర్యం కల్పించారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: విద్యార్థులు చదువుల్లో రాణించాలని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. సాక్షి దినపత్రిక ఎడ్యుకేషనల్ పేపర్లను వెంకట్‌రాంరెడ్డి ఫరూఖ్‌నగర్, కొందుర్గు, వెలిజర్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో ఉన్నత లక్ష్యాలను సాధించాలనే ఉద్దేశంతో తమ వంతు సహకారం, ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని సాక్షి దిన పత్రిక 'విద్య' పత్రులను రూపొందించడం హర్షణీయమన్నారు. ఈ పత్రికలో విద్యా, ఉద్యోగం, రాజకీయం, క్రీడలు, వ్యవసాయం, సామాజిక తదితర అంశాలతో కూడిన ఎన్నో విషయాలు పొందుపర్చారన్నారు. ఇవీ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఎడ్యుకేషనల్ పేపర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎంఈఓ శంకర్ రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమృతమ్మ, నర్సింహ్మారెడ్డి, ఎంపీటీసీ లావణ్య అశోక్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, గణేష్‌గౌడ్, జాంగారి రవి, తుప్పరి యాదగిరి, దొడ్డిరాందాస్, శేఖర్, దొడల శేఖర్, ఖాజా మొయినొద్దీన్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సాక్షి విద్యా పత్రికలను విద్యార్థులకు అందజేసిన జెడ్పీటీసీ

పంట నష్టం వివరాలను నివేదిస్తాం

మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్



పీర్లగూడలో ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న ఏఓ నిషాంత్‌కుమార్

షాద్‌నగర్: గ్రామాల్లో వేసిన చాలా పంటలు ఎండిపోయాయని, పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ తెలిపారు. శనివారం చౌలపల్లి, పీర్లగూడ గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఏఓ నిషాంత్ కుమార్ ఆయా గ్రామాల్లో రైతులు వేసిన పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించారు. అనంతరం ఏఓ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా వర్షాలు కురవకపోవడంలో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. వర్షాధారంతో పెరిగే పంటలకు సరైన సమయంలో నీరందక ఎండిపోయాయని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ తేజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బాలాజీ టౌన్ షిప్‌లో ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్సులతో పాటు హెల్మెంట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంతో మంది యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్రవాహనాదారులు విధిగా హెల్మెంట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌భాస్కర్, మోహన్‌సింగ్, నర్సింహ్మా యాదవ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ఇంజనీరింగ్‌తో బంగారు భవిష్యత్



ఓరియంటేషన్ డేకు హాజరైన ప్రతినిధులు

రాంకీ ఎన్వీరో ఇంజనీర్స్ సంస్థ సీఈవో గౌతమ్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: ఇంజనీరింగ్ ఎంచుకున్న విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని రాంకీ ఎన్వీరో ఇంజనీర్స్ సంస్థ సీఈవో గౌతమ్ రెడ్డి అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రవేశిస్తున్న విద్యార్థులకు ఒరియంటేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్య ఉన్నతమైందన్నారు. ఈ విద్యను మంచిగా చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నతశిఖరాలు అధిరోహించొచ్చన్నారు. విద్యతో పాటు ప్రతీ విద్యార్థికి క్రమ శిక్షణ అవసరమన్నారు. అనంతరం విద్యార్థులచే యాంటీ ర్యాగింగ్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి బాబారెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ చదువులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ పద్మజ, కోఆర్డినేటర్ డాక్టర్ పి.సారా, సీఈవో డాక్టర్ శ్రీరామ్‌రెడ్డి, టీఅండ్‌పీ అధికారిణి శిఖా కౌశిల్, ఏవో వెంకటాచలం, కోఆర్డినేటర్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గర్జనకు తరలిన జనం



మొయినాబాద్‌లోని వెంకటాపూర్ నుంచి సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల/మొయినాబాద్/శంకర్‌పల్లి/షాబాద్: చేవెళ్ల గర్జనకు అధిక సంఖ్యలో ప్రజలు తరలినట్లు పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యులు పామెన భీంభరత్ అన్నారు. పీసీసీ కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, ఎస్. రాంరెడ్డి, మహిళ అధ్యక్షురాలు అశ్వని, జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్ రామ్, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, పాల్గొన్నారు.

భారీగా ట్రాఫిక్ జామ్..

ప్రజాగర్జన సందర్భంగా భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సభా ప్రాంగణానికి సాయంత్రం 4.30నుంచి 5గంటల వరకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచి పోయింది. వికారాబాద్, పరిగి, తాండూర్, హైదరాబాద్, షాబాద్, షాద్‌నగర్, శంకర్‌పల్లి వెళ్లే వాహనదారులు, తీవ్ర ఇబ్బంది పడ్డారు.